# పసి మనసు

ప్రక్కింట్లో నుండి ముందు పెద్ద కేకలూ, ఆ వెంటనే దెబ్బలూ, వాటి వెంట పెద్ద ఏడుపూ వినిపించడంతో, చేస్తూ చేస్తూ ఉన్న పనిని ఆపి, శాంత దడిమీదుగా తొంగిచూసింది. ప్రక్కింటివారి రాధాయి నేలమీద పడి దొర్లుతున్నాడు. వాళ్ళమ్మ, చేతిలో ఇంత కద్దు కర్రముక్క పట్టుకొని ఉంది. ఇద్దరు ముగ్గురు పిల్లలు, పందిరి గుంజ దగ్గర నిలబడ్డారు. రాధాయికి దూరంగా పలకా, పుస్తకాలూ, చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.

అటువంటి దృశ్యం, ఆ తరువాత శాంత ప్రతిరోజూ చూస్తూనే ఉండేది. రాధాయిని బళ్ళోకి పంపడమంటే, యజ్ఞం చేసినంత పనయ్యేది. ప్రతిరోజూ ముందుగా కేకలూ, ఆ వెంటనే దెబ్బలూ, ఆ మీదట రాధాయిగాడి ఏడుపూ, ఓ క్రమంతో సాగిపోతూ ఉండేవి.

అనేకసార్లు రాధాయిని గురించి ఆలోచించింది శాంత. కావటానికి వాడు చాలా చురుకైన వాడేనూ. ఏదన్నా ఒక్కసారి చెవితేచాలు ఇట్టే గ్రహిస్తాడు. వాడికున్న జ్ఞాపకశక్తి కూడా పెద్దదే. ఒకసారి తనెప్పుడో అన్నది 'కాఫీ తాగితే ఎదిగే పిల్లలు గిడసబారి పోతారు' అని – 'అయితే మామయ్య తాగుతా డెందుకత్తయ్యా? మామయ్య గిడసబారి పోతాడా?' అన్నాడు రాధాయి. ఆ ప్రశ్నకు ఏవో బులిబుచ్చకం కబుర్లు చెప్పి, మాట మార్చింది తను.

స్వతహాగా పిల్లలందరూ మంచివాళ్ళే. వాళ్ళ మనస్సులు శుభ్రంగా అద్దంలాగా ఉంటాయి. ఆ అద్దంలోకి మన మేమి చూపిస్తే అదే మనకు కనిపిస్తుంది. అద్దాన్ని తిట్టి ఏం లాభం?

బళ్ళో కెళ్ళడానికి రాధాయి ఎందుకంత పేచీ పెడుతున్నాడో తనకు తెలియదు. చక్కగా, పదిమంది పిల్లలతో కలిసి, ఆడుతూ పాడుతూ వెళ్ళి రావలసిన వయస్సుగదా! వాళ్ళు హైరానమయ్యేలా అన్ని దెబ్బలన్నా తింటాడు గానీ, బళ్ళోకి మాత్రంపోడు. అంటే దెబ్బలకన్నా మించిన ఏదో బాధ, వాడి కక్కడ ఉన్నదన్నమాట.

అందులో వాడూ, రవీ గూడా చాలా సావాసంగా ఉంటారు. రేపో మాపో రవిని గూడా స్కూల్లో వేదామను కొంటున్నారు ఆయనగారు. వీడి ధోరణి చూస్తుంటే ఆ రాధాయి గాడికి నకలు కింద తయారయ్యే టట్లుగా ఉంది. రెండు మూడు సార్లు వాడి నాన్న 'మంచిరోజు చూచి, రవిని గూడా బళ్ళోకి పంపుదాం'— అన్నాడు. వెనకా ముందూ చూడకుండా రవి 'నే పోను' అని తెగేసి చెప్పాడు. 'ఎందు కనిరా? అంటే, 'కొడతా' రని చెప్పాడు. బళ్ళోకే పోని వాడికి, ఇన్ని సంగతు లెలా తెలిశాయో, ఇంకేం ఆ రాధాయి గాడు చెప్పుంటాడు.

రవిగాడు బళ్ళో కెళ్ళాలంటే ముందు రాధాయి గూడా వెళ్ళాలి. బడంటే ఏమిటో రాధాయి బాగా రవికి నూరిపోసి ఉంటాడు. అదిగాక, రాధాయి రోజూ 'నే బళ్ళోకి పోనని మారాం చెయ్యటమూ, వాళ్ళమ్మో, నాన్నో, గొడ్డును బాదినట్టు వాణ్ణి బాదటమూ, రవి చూస్తూనే ఉన్నాడు.

బళ్లో కెళ్ళడమంటే రోజూ ఇలానే దెబ్బలు తినాలిగాబోలు భగవంతుడా అని, రవి ఆలోచించవచ్చు. అందుకేనేమో, బడి అనగానే రవి కాళ్ళకు చుట్టుకొని 'నేను పోనమ్మా!' అని బావురుమంటున్నాడు. దీని కేదో విరుగుడు ఆలోచించా లనుకొన్నది శాంత.

ఇది జరిగిన రెండో రోజున, బడివేళకు తమ యింట్లో కొచ్చి దాక్కున్నాడు రాధాయి. ఆ సంగతి ప్రక్కింటి వారికి చెప్పింది శాంత. వాణ్ని సక్రమంగా బళ్లోకి పంపించే పూచీ తను తీసుకుంది. అనవసరంగా వాణ్ని బెదర గొట్టద్దన్నది. వచ్చి రాధాయిని బుజ్జగించింది. మెల్లిగా మాటల్లోకి దింపి, రాధాయి నోట అంతా చెప్పించింది. ఆ సంగతులు వింటుంటే శాంతకే భయం వేసింది.

వాణ్ని, ఆయ నెవరో ప్రైవేటు మాస్టారుట—అక్కడికి పంపుతున్నారు. ఎక్కడన్నా చిన్న తప్పు పోయినా, ఆయన గుంజిళ్ళు తీయిస్తాట్ట. కోదడం వేయిస్తాట్ట. ఉదయంనుండి మధ్యాహ్నందాకా నిలబెడతాట్ట. పిల్లల్ని ఊరికే చెండుకు తింటాట్ట. అందుకే తను బళ్లోకి పోట్ట.

'మరి బళ్ళోకి పోకపోతే చదువెలా వొస్తుంది?' అన్నది శాంత.

'నాకొద్దు' అన్నాడు రాధాయి.

'చదువు రాకపోతే ఉద్యోగం ఎలా చేస్తావ్ ?' అన్నది శాంత.

'చెయ్యను', అన్నాడు రాధాయి.

'మరి అన్నమూ, కొత్త కొత్త లాగూలూ, చొక్కాలూ, పిప్పరమెంటూ, ఇవన్నీ ఎలా...?' అన్నది శాంత.

'అమ్మిస్తుంది' అన్నాడు రాధాయి.

'ఇప్పుడంటే ఇస్తోంది. పెద్దయితే ఎలా?' అన్నది శాంత.

రాధాయి మాట్లాడలేదు.

'మరి బళ్ళోకి పోతావా!' అన్నది శాంత.

'ఊహుఁ నే పోను' అన్నాడు రాధాయి.

'వాళ్ళ సీను చక్కా రోజూ బళ్ళోకి పోతున్నాడు. రేపు వాడు బాగా చదువుకొని మంచి ఉద్యోగం చేస్తాడు. నువ్వేమీ చెయ్యలేవు' అన్నది శాంత.

'నేనూ చేస్తా' అన్నాడు రాధాయి.

'నీ ముఖం చేస్తావు. చదువుకోని వాడికి ఉద్యోగం ఎవరిస్తార్రా?' అన్నది శాంత.

రాధాయి మాట్లాడలేదు. శాంత వేపు, ఏమిటో చెబుదా మన్నట్లుగా చూశాడు.

వాళ్ళ బళ్ళో కొట్ట రత్తయ్యా. మరేమో, మా మాష్టారేమో, ఊరికే తొడపాశం పెడతా రత్తయా!' అన్నాడు రాధాయి.

ఆ మాటలు అంటున్నపుడు, వాడి కళ్ళల్లో గిర్రుననీళ్ళు తిరిగాయి!

'నీ నెళ్ళే బడిలో కెడతావా మరి' అన్నది శాంత.

'మా నాన్న పంపిచడుగా' అన్నాడు రాధాయి.

'నే చెబుతాగా' అన్నది శాంత.

'ఓ అవ్వాల్ రైటుగా పోతా నత్తయ్యా' అన్నాడు రాధాయి.

'అక్కడ మంచి మేష్టారున్నా డత్తయ్యా. వాళ్ళ బళ్ళో, ఎన్నో పటాలూ, బొమ్మలూ ఉన్నాయి. చిన్న చిన్న కుర్చీలు, బల్లలు, చాపలు, కాకి, ఏనుగ, కోడి, బాతు, కడవ, కంకి, నెమిలి, చా...లా...ఉంటాయి. ఆ బళ్ళో చక్కా ఆడుకో వచ్చు. పాడుకోవచ్చు. బొమ్మల్తో చదుకో వచ్చు నత్తయ్యా. నీను కెన్ని పాట లొచ్చని – ఇంకా తల దువ్వుతారు, పాలు పడతారు' అన్నాడు రాధాయి.

'మరి, ఆ బళ్ళోకి పోతావా?' అని అడిగింది శాంత.

'ఓ' అన్నాడు రాధాయి తలెగ రేస్తూ.

ఆ తరువాత 'అత్తయ్యా' – అని పిలిచాడు రాధాయి అనుమానంగా.

'ఏమిట్రా?' అన్నది శాంత.

'నాకే ఉద్యోగం వస్తుంది అత్తయ్యా?' అన్నాడు రాధాయి.

'కలెక్టరు పని' అన్నది శాంత నవ్వుతూ.

'అప్పుడు దర్జాగా కుర్చీలో కూర్చో వొచ్చుగా అత్తయ్యా!' అన్నాడు రాధాయి.

'ఆఁ' అంది శాంత ఫక్కున నవ్వి.

'నీను కంటే నేను చక్కా' చదువు కొంటాను. వాడి కన్నా మంచి ఉద్యోగం చేస్తాను. కలెక్టర్నవుతాను' అన్నాడు రాధాయి.

'అలాగేకా బాబూ' అన్నది శాంత.

'అప్పుడు నీకు మంచి మంచి తిమ్మిరి బిళ్ళలూ, చాక్లెట్లూ, రంగు తళుకులూ, నెమిలికళ్లూ ఇస్తానత్తయ్యా. మా అమ్మ కేమీ ఇవ్వను....మా అమ్మ కొట్టుద్ది. నువ్వేమో

కొట్టవు. నువ్వు మంచిదానివి గదూ అత్తయ్యా! నేను కలెక్టర్నయి బడబడా జకజకా, భాఁయ్, భాఁయ్ మని కారుమీద పోతుంటే, ఈ రంగడూ, కిష్టాయీ, పుల్లారావు 'నన్నెక్కించుకో రాధాయ్, నన్నెక్కించుకో రాధాయ్'అని అరిచినా సరే – నేను ఎక్కడా ఆపను అత్తయ్యా' అన్నాడు రాధాయి.

'ఎందుకనిరా ?' అన్నది శాంత.

'వీళ్ళు రోజూ నన్ను లాక్కుపోయి పంతులుచేత కొట్టిస్తా రత్తయ్యా.'

రాధాయి ఆ పూట శాంత దగ్గరే అన్నం తిన్నాడు. ఆ మర్నాటి నుండి వాడు కొత్తబళ్ళోకి పోతున్నాడు. ఇప్పుడు రాధాయికి ఒక్కటే భయం. సీనుగాడు తనకన్నా బాగా చదివి కలెక్టరవుతాడేమోనని, అందుకే వాడికన్నా ముందు తనే కావాలని రాధాయిగాడి పట్టుదల.